# బంధం! - బాంధవ్యం !

పోలీసు డిపార్ట్‌మెంట్‌లో 'జాబ్' రావటమంటేనే ఎంతో గొప్ప ! రాత్రిబవళు శ్రమించినా అందుకు తగిన ఫలితముంటుందనే ఆశ ! అందునా డైరక్ట్ ఎస్సై పోస్ట్‌కి సెలక్ట్ అయి వుద్యోగం సంపాదించటమంటే ఆషామాషీ కాదు. 'రేటు' పెట్టి జాబ్ సంపాదించినా... బోలెడంత ఆర్జన ! ప్రమోషన్ల మీద ఎ.ఎస్పీ దాకా ఎదగచ్చు !

నా సర్వీసంతా జంటనగరాల్లోనే. ల్యాండ్ సెటిల్‌మెంట్ హేండిల్ చేసి అయిదారు కోట్ల వెనకేసుకున్నాను. నేను సెల్ఫిష్ పర్సన్ను కాదు. అందరికీ తిన్పించి నేనూ మింగాను. అంతా వాటాల వ్యవహారమే ! ఎవర్నీ కాదనకూడదు... మర్చిపోకూడదు. ఈ థియరీ ఫాలో అయితే పొజిషన్ సేఫే !

రిటైరయ్యేదాకా నాకేరీర్ క్లీన్ చిట్టే ! నా జోలికెవరూ రాలేదు. వేలు పెట్టి చూపబడలేదు. అది నా తెలివితేటలో... అదృష్టమో నాకే అర్థంకాదు.

సర్వీసులో వుండగానే నలుగురు ఆడపిల్లల పెళ్లి అంగరంగవైభంగ చేశాను. పెద్దవాడు ఐ.పి.ఎస్.! ఢిల్లీ వదలిరాడు సెంట్రల్లో మంచి పలుకుబడివుంది. సిన్సియర్ అండ్ హానెస్ట్ అనేపేరు సంపాదించుకున్నాడు. మరో ఐ.పి.ఎస్. ను ప్రేమించి పెళ్లాడిన విషయం చాలారోజుల వరకూ తెలీదు.

రెండోవాడు వఠిచవట ! చదువులో చురుకు కాకపోవటంతో ఇంటర్‌తో ఫుల్‌స్టాప్ పెట్టాడు. జులాయి వెధవ ! అమోఘమైన తెలివి తేటలున్నయ్ ! కానీ ఏం లాభం వాటి, సవ్యంగ ఉపయోగించుకోడు.

పెద్దవాడు ఇంటికి రాకపోవటం చూచి... చివరికి మన తలకొరివి పెట్టటానికైనా వస్తాడో రాడోని ఏడుస్తూంటుంది.

వాడు రాకపోతే రెండోవాడు లేడా ఏం? సమయానికి ఎవరో ఒకరు తగలేస్తార్లే... నువ్వేం దిగులుపడకు... శ్రీమతిని బుజ్జగించాను.

మూడో అబ్బాయి కంప్యూటర్ ఇంజనీరు. ఆస్ట్రేలియాలో సెటిలైనాడు. ఆదాయం... వగైరాలో స్టేటస్ వున్నవాడు. వీడు అంతే! అక్కడ దొరసానినే ప్రేమించి పెళ్లి చేసుకన్నానని ఇంటర్నెట్లో చెప్పాడు. వాడి పెళ్లానికి మనభాష రాకపోయినా

చూడటానికి ముచ్చటగా వుంది.

రెండో వాడికి వ్యాపారంలోనో వుద్యోగంలోనో సెటిలయ్యే దాకా మ్యారేజ్ చేయతల్చుకోలేదు. వాడేమో పెళ్లి పెళ్లంటూ ఒకటేగోల! తనకంటే చిన్నవాడు పెళ్లి చేసుకుని హాయిగ వుండగ తనకెందుకు పెళ్లి చేయరంటూ వాదులాట!

'ఒరేయ్, నువ్వు లైఫ్‌లో సెటిలైతే గాని పెళ్లి చేసేదిలేదు....' ఖచ్చితంగ తెగేసి చెప్పాను.

ఢిల్లీలో వున్న పెద్దవాడికి ఆడపిల్ల కలగటంతో ఏడాదిలోపే మనుమరాలిని తెచ్చి మాకు అప్పగించివెళ్లిపోయాడు. సౌమిత్రిలో వాళ్ల డాడీని చూచుకు మురిస్తూ పిల్లదాన్ని అపురూపంగ పెంచసాగాము.

చిన్నతనంలో కూడా మనుమరాలు సౌమిత్రి అల్లరి చేసేదికాదు. కడుపు నిండా పాలు పడితే ఏడ్చేది కాదు. కాస్సేపు ఆడుకుని నిద్రపోయేది. పెద్దపిల్ల అయిన తర్వాత కూడా సౌమిత్రి డిసిప్లిన్డ్ ! పోలీసువాడి కూతురు కదామరి! తండ్రి తల్లి నేను (తాతని) ముగ్గురం అదే డిపార్ట్‌మెంట్‌లో సర్వీసు చేస్తున్నవాళ్లం కాబట్టి మనుమరాలికి మా లక్షణాలే అబ్బినయ్!

టెన్త్‌లో స్టేట్ ఫస్టొచ్చిన సౌమిత్రిని ఫర్‌దర్ స్టడీస్ కోసం కొడుకు కోడలు వచ్చి సౌమిత్రిని వాళ్లతో తీసుకెళ్లిపోయారు. ఏళ్ల తరబడి మాతోవున్న సౌమిత్రి వెళ్లిపోయాక మాకేదో అసంతృప్తి వెలితి అన్పించింది.

రెండోవాడు చెడుసావాసాలు తిరుగుళ్లతో మనిషి పాడైపోయాడు. మమ్మల్ని లెఖ చేయడంలేదు. వాడి అవసరాలకు నేను డబ్బు ఇవ్వకపోవటంతో నలుగుఐదుగురు ఫ్రెండ్స్‌ను కూడగట్టుకుని ఒక ముఠాగా తయారై చైన్ స్నాచింగులకు... రాత్రిళ్లు ఇళ్ల తాళాలు పగలకొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నాడనే వాస్తవం నాకు లేటుగ తెల్సి చీవాట్లు పెట్టాను. వాడేమైనా చిన్నపిల్లవాడా చావగొట్టటానికి?- నువ్వెంతంటే నువ్వెంతని ఇల్లుపట్టకుండా ఎటోవెళ్లిపోయి మాకు పుట్టెడు దు:ఖాన్ని మిగిల్చాడు.

విష్ణు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంగతి ఫోన్‌చేసి పెద్దవాడికి చెప్పి వాడిని గురించి కొంచెం వివరాలు తెల్సుకోమన్నాను.

నేను చెప్పిన ఏడాదికి ఢిల్లీ నుంచి ఫోనొచ్చింది! విష్ణు ముంబైలో రాబరీకేసులో ఇన్వాల్ అయి పోలీసులకు పట్టుబడ్డాడని... వంటినున్న నగలు కాజేయటం కోసం

బంగారు నగలు వ్యాపారం చేసే సేట్ భార్యను చంపిన కారణాన కోర్ట్‌లో శిక్షపడి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడనే వార్త వినాల్సి వచ్చేసరికి నా గుండె ఆగినంతపనైంది. నా వైఫ్ ఒకటే ఏడుపు.

మొగుడు... కొడుకు... కోడలు ముగ్గురు పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్లుండగ విష్ణు జైలు శిక్ష అనుభవించ వలసి వచ్చినందుకు గుండెలు బాదుకుంది నా శ్రీమతి.

'విష్ణునెలాగైనా విడిపించే ఏర్పాటు చేయండి.' అంటూ నన్ను వేదించసాగింది.

చూడు వాడు చేసింది దొంగతనం కాదు, హత్య! న్యాయస్థానం వాడికి నైస్ ఇంప్రజన్‌మెంట్‌వేసింది. ఇప్పుడు ఎవ్వరం ఏమీచేయలేము సుజాతా.... ఓదార్చటానికి ప్రయత్నించాను.

నవమాసాలు మోసికని పాతికేళ్ళుపెంచినవాడిని చివరకి జైలుకి అప్పగిస్తారా....ఇదేం న్యాయమండి? పైకోర్టుకు అప్పీలు చేసుకుని లీగల్‌గా పోరాడి విష్ణును దక్కించుకుందామండీ...ఎంత డబ్బు ఖర్చైనా పర్వాలేదు మీరు వెనకాడకండి.

ఇప్పుడెలాగే....శిక్షఅమలమలైనతర్వాత మనవల్ల కాదే... అదే ట్రయల్లో వున్నప్పుడైతే ఎవరికాళ్లైనా పట్టుకునో.... పాతిక లక్షలు ఇచ్చో... శిక్ష పడకుండా పోరాడి ఉండే వాళ్ళం! అప్పీల్ చేసుకునేటైమ్ కూడా దాటిపోయింది. ఇప్పుడే ప్రయత్నం చేసినా ప్రయోజనం వుండదే...ఏంచేసాం? ఎవరి ఖర్మ ఎలా రాసి పెట్టి వుంటే అలా జరక్కమానదు. పోలీసు ఆఫీసరుచేసిన నాకొడుకు దొంగ కావటమేమిటి?.... ప్రారబ్ధ ఖర్మ కాకపోతే?.... కన్న తండ్రినైనందుకు నాహృదయాంతరాళాల్లోంచి దు:ఖం తన్నుకొచ్చింది.

అయితే కన్నకొడుకుని అలా వదిలేసి వూరుకోవటమేనా..? సుజాత బావురుమంది.

ఏం చేస్తాం.... గుండె రాయిచేసుకోక తప్పదు. అలాంటి దౌర్భాగ్యుడుమన కడుపున పుట్టినందుకు గుండె కోత తప్పదు.

'వాడు జైలు శిక్ష పూర్తి చేసుకుని తిరిగొచ్చేనాటికి మనం బ్రతికి వుంటామో లేదోనండి...' గొల్లుమంది సుజాత.

'ఊరుకో! ఏడ్చి ప్రయోజనం లేదు. నీకు అంతగా చూడాలనిపిస్తే... ముంబై సెంట్రల్ జైలుకు వెళ్ళి విష్ణును ఒకసారి చూచి ఎలా వున్నామో పలకరించి వద్దాం.... నచ్చ చెప్పి సుజాతను ఏదోవిధంగ సముదాయించాము.

మార్నింగ్ వాక్.... .జాగింగ్ యోగ చేసేవాడిని కాబట్టి నా ఆరోగ్యాని కేం డోకా లేకుండా జీవితం సాగిపోతుంది. ఆరోగ్యసూత్రాలు క్షుణ్ణంగా పాటిస్తాను. నావయస్సు ఎనభై అంటే ఎవరూ నమ్మరు.

ఒక్క చెడు అలవాటు లేదు స్మోక్ చెయ్యను లిక్కర్ ముట్టను. కార్డ్స్ ఆడను క్లబ్బుకెళ్ళే అలవాటు లేదు. నావంటి వాడు పోలీసు డిపార్ట్‌మెంట్లో వున్నందుకు సర్వీసులో వుండగా అందరూ ముక్కున వేలేసుకునేవారు.

తిండి విషయంలో వెనుకాడేదే లేదు బకాసుర తిండి! పాతిక పరోటాలు....డజన్ ఎగ్స్....అరకేజీ కోడికూర వక్కడినే లాగించగల సత్తా వున్నవాడిని!

ఏమిటా రాక్షసతిండి? దిష్టితగిలేను బైటికెళ్ళినప్పుడు కొంచెంలిమిట్‌గా తినటం మంచిది...కాపురానికి వచ్చిన కొత్తల్లో సుజాత హెచ్చరిస్తూ వుండేది.

నా ఎనభై ఏళ్ళ జీవతంలో చర్రున చీది ఎరుగను... తలనొప్పి అనేది ఎరుగను. నన్ను చూస్తే బహుశరోగాలకు భయమేమో?

నాజూగ్గా తినటం ఇప్పటికే నాకు అలవాటు లేదు.

సుజాత సంగతి సరే సరి! అరడజను మంది పిల్లలనను కని ముప్పైయ్యేళ్ళకే ముసిల్ది అయింది యాభైనిండకుండానే మోకాళ్ళ నొప్పులతో బాధపడుతూంటుంది ఇంట్లో వంట మనిషి.... పనిమనిషి వుండబట్టి సరిపోయింది... లేకపోతే ఎప్పుడో మంచాన పడేది.

ముగ్గురు అల్లుళ్ళూ మూడుదేశాల్లోవున్నారు. వీలున్నప్పుడల్లా నెట్లో మాట్లాడటం తప్ప... రెండు మూడేళ్ళకోమారైనా ఇండియా కొచ్చి చూచిపోనందుకు నేను సుజాతా బాదపడుతూంటాం.

ఇక మగ పిల్లల సంగతిసరే సరి! శలవు దొరకటం కష్టమని పెద్దవాడు... వచ్చిపోవాలంటే రెండు లక్షలు ఖర్చు అవుతుందని మేడోవాడుగోల! రెండోవాడు జైలు పాలై నానా అవస్థపడుతున్నాడు.

ఇంట్లో నేను సుజాత ఇద్దరమే మిగిలాము మాతో ఎవరూ లేరేని ఒకటే దిగులు. కలిసివుందాం...డిల్లీ నుండి ఏ.పి.కి బదిలీచేయించుకురా రాని బ్రతిమిలాడినా ససేమిరా మాటవినడు!

నామనుమరాలు సౌమిత్రి డిల్లీలో మెడిసిన్ చదివి ఎమ్.ఎస్. కోసం అమెరికా

వెళ్ళింది. సౌమిత్రి ఇంట్లో దోగాడిన పసిది... అప్పుడే డాక్టరవటం... పైచదువుకు అమెరికా వెళ్ళటం...అంతా ఆశ్చర్యంగా వుంటుంది. ఆలోచిస్తూంటే.... రోజులు ఎంత వడిగా గడిచి పోతున్నయ్ అనిపిస్తుంది.

ఇంటి ముందు టాక్సి ఆగింది!

రావోయి... రా! ఫ్లైట్లో ఢిల్లీ నుంచేనా రావటం?..... టాక్సిదిగి లోనికి వస్తున్న పెద్దకొడుకు

రాఘవను చూచి సాదర ఆహ్వానం పలికాను.

ఏమేవ్ రాఘవ వచ్చాడు..... ముందు వాడికి డ్రింకేదైనా పంపించు.... కేకేసి చెప్పాను సుజాతతో వచ్చి మేనంగ సోఫాలో రాఘవ కూర్చుండి పోవటం చూచి ఎందుకని పెద్దోడు సైలెంటుగా వున్నాడు... సడన్‌గా రావటానికి కారణం ఎమైవుంటుంది... అనేసి నామనసు పరి పరి విధాలుగా ఆలోచించ సాగింది.

ఇంతలో వంటావిడ డ్రింక్‌ట్రేతో..... వెనకగా సుజాత ఇద్దరూ వచ్చారు.

డ్రింక్ తీసుకో రాఘవా!.....అవునూ వక్కడివే వచ్చావేం.? కోడలేది?.... ఎదురు సోఫాలో కూర్చుంటూ కొడుకును పరామర్శించాది సుజాత.

డ్రింక్ తాగి గ్లాస్ ట్రేలో పెట్టేయటంతో అంతవరకు అక్కడే నిలబడిన వంటావిడ తిరిగి లోనికి వెళ్ళింది.

ఎందుకురా అంత సీరియస్‌గా వున్నావ్? విషయమేంటి? రాఘవ ముఖంలో కి తేరి పారచూచి అడిగాను.

'ఏమని చెప్పమంటావ్?....కడుపుచించుకుంటే కాళ్ళమీద పడ్డట్టుంది.....

'విషయమేమిటో వివరంగా చెప్పు రాఘవా? తల్లి తరచి అడిగింది.

నీ మనుమరాలు ఘనకార్యం చేసేడ్చింది.....'

'ఎవరు? సౌమిత్రా? అది స్టేట్స్‌లో కదా వుంది....అదేం చేసిందని?...' కలవరుపాటుతో ప్రశ్నించాను.

'చెప్పరా అసలేంజరిగిందో? అది అమెరికా నుండి రానంటోందా? అక్కడే ఉ ద్యోగం చేస్తానంటోందా? సుజాత ప్రశ్నల మీద ప్రశ్నలు వేసింది.

'నాకొంపకు నిప్పెట్టింది! నా గౌరవం గంగ పాలు చేసింది! నాకున్న స్టేటస్‌కు తీరని తలవంపులు తెచ్చింది.....? ఆవేశంగ మాట్లాడాడు రాఘవ.

రాఘవ ఆవేశం చూచి నేను సుజాత విస్తు పోయాం! తదేకంగా రాఘవ ముఖంలోకి చూస్తూండిపోయాం.

'మనతో మాట మాత్రమైన చెప్పకుండా......మన అంగీకారంతో పన్లేకుండా....అది పెళ్ళి చేసుకుంది.....' గాద్గదికంగా మాట్లాడాడు రాఘవ.

ఒక్క క్షణం నివ్వరపోయిన నేను' సౌమిత్రి ఎప్పటికి అలా చేయదు. నో! ఐకాంట్ బిలీవ్...యువార్ మిస్టేకేన్..... మనుమరాలి మనస్తత్వం బిహేవియర్ తెలిసిన వాడిని కాబట్టి......నేను పెంచిన సౌమిత్రి నడవడిక గురించి కన్న తండ్రే ఆ విధంగా మాట్లాడుతుంటే నమ్మ శక్యం కాలేదు.

'ఇటీజ్ ఫాక్ట్! నేట్లో దాని హజ్బెండ్ ఫోటో కూడా చూపించింది.....'

'నేను నెట్ కనక్షన్ తీయించి చాలా కాలమయింది. ఆ కారణాన సౌమిత్రి తో మాట్లాడగల అవకాశం లేకుండా పోయింది.

ఈ రోజుల్లో చదువుకున్న ఆడపిల్లలు సర్వ స్వతంత్రులు అయిపోతున్నారు. నిర్ణయాలు వాకికై వారే తీసేసుకుంటున్నారు. అందునా..... సౌమిత్రి అమెరికాలో వుంటున్నది కదా? దానికే పడమటి గాలి సోకి అక్కడి నీళ్ళు వంటబట్టి ఇలాంటి తెలివి తక్కువపని మనెవ్వరికి చెప్పకుండా చేసి వుంటుంది. అంతా జరిగాక ఇప్పుడేడ్చి ఏం ప్రయోజనం నిట్టూర్చింది సుజాత.

'పోనీ...విషయం తెలియగానే... నువ్వూ కోడలుదానిదగ్గరకు వెళ్ళి.... దానికి నచ్చ చెప్పి రావలసింది...'

'ఇంకా ఎంటి డాడి నచ్చ చెప్పేది? అదేమైనా చిన్నపిల్లా? పెళ్ళి జరిగిపోయిందని చెప్పాక అంతదూరం వెళ్ళటం కూడా శుద్ధ వేస్ట్ అన్పించింది...'

'ఇంతకూ.... సౌమిత్రి ఎవరిని రా చేసుకుంది?...' నొసలు చిట్లించి అడిగింది తల్లి.

'ఎవడోకొన్కిస్కాగొట్టంగాడు.... ఇక్కడి వాడేట... హైదరాబాద్ వాడేనని చెప్పింది.....

'అట్లా తుస్కారంగ మాట్లాడకురా?.... ఎంత కోపంవున్నా.... అతను నీకు అల్లుడు!

అవునూ అతనే చేస్తున్నాట్ట అక్కడ?...'

'అక్కడ హాస్పిటల్లో న్యూరో సర్జనట! ఇదేమో మనసు పారేసుకుని ప్రేమించేసి వెంటనే పెళ్ళాడేసిందట....'

'అతగాడిపేరు ఇతర వివరాలు కనుక్కున్నావా నీ డాటర్ ద్వారా?...'

'పేరు రమేష్ అని చెప్పింది! చానా పూర్ ఫ్యామిలి నుంచి వచ్చి స్వయం కృషితోపైకొచ్చాడట...ఒకప్పుడు ఇక్కడ మీ ఇంట్లో సర్వెంట్‌మెయిడ్ ఓన్లిసన్ ఆ కుర్రాడని కూడా చెప్పింది.... పోయి పోయి... పాచిపని చేసుకు బ్రతికిన దాని కొడుకునా ఇది చేసుకోవటం?....'

'ఇవన్నీ వింటూంటే.... నా కిప్పుడు గుర్తుకొస్తున్నది. నాంచారమ్మని మన ఇంట్లో పని చేస్తూ వుండేది దాని మొగుడు ఉత్త తాగుబోతు. వాళ్ళకు ఒక్కగా నొక్క కొడుకు కుర్రాడు చిన్నతనంలోనే దాని మొగుడు నడిపే రిక్షా యాక్సిడెంట్‌కు గుర్రై అతను చనిపోయాడు..... పోని బీద ముండకదాని నేను సాయం చేశాను. నాకు బాగా గుర్తుంది. సౌమ్య నాదగ్గరుండే రోజుల్లోనే సడన్‌గ నాంచారమ్మకూడా చనిపోవటం సంభవించటంతో..... దాని కొడుకుని మనింటికి తీసుకొచ్చి మాతోవుంచి చదివించాను. కుర్రాడు చురికైనవాడు...చదువులో ఎప్పుడు స్కూల్లో ఫస్టొచ్చేవాడు.

టెన్త్‌లో ర్యాంక్ వచ్చినందుకు ఎంతో సంతోషించాను...వాడ్ని ఇంటర్లో చేర్చి హాస్టల్లో జాయిన్ చేశాను.

అప్పుడప్పుడు వాడు మన ఇంటికొస్తుండేవాడు. అతని పేరు నవ్వు అని చెప్పిందే....ఆ రమేష్! ఇంటర్లో ర్యాంక్ సాధించానని నాతో గర్వంగా చెప్పాడు. ఆరోజు వంగి నా పాదాలకు నమస్కరించాడు కూడా... అతని పట్టుదల కృషికిమెచ్చి పదివేల రూపాయలు వాడికి గిఫ్ట్‌గా కూడా ఇచ్చాను మెండిసన్ చేస్తానని చెప్పాడు...ఆ తర్వాత ఎప్పుడో ఒకటి రెండు సార్లు ఆ కుర్రాడు మనింటికొచ్చి భోజనం కూడా చేసివెళ్ళాడు....కదుటే సుజాతా?...' చెప్తూ సగంలో ఆపి శ్రీమతి ముఖంలోకి చూశాను.

అవునండి మీరు చెప్తుంటే నాకు గతం గుర్తుకొచ్చింది. పనిమనిషి కొడుకైతే మాత్రమేం? కుర్రాడు బుద్ధిమంతుడు......తెలివైనవాడు. మన మంటే ఎంత వినయం?.....ఎంత విధేయత?...అంటే... రాఘవ చెప్తున్న అబ్బాయి రమేష్..... నాంచారమ్మ కొడుకు రమేష్ ఒక్కడేనంటారా ఎంటీ....?'ధీర్ఘాలు తీసింది సుజాత.

'నేనటం కాదే పిచ్చిమొహమా...పెద్దోడు రాఘవ చెప్తోంది వింటూంటే....వీడే

వాడు... వాడేవీడు అన్పించకమానదు. ఎస్. నీ అల్లుడు రమేష్...అదేరా సౌమిత్రి ప్రేమించి పెళ్ళాడిన కుర్రాడు.....కాదు కాదు...సారీ న్యూరో సర్జన్.... నాంచారమ్మ కొడుకేనని రూఢీ అయింది. అయితే ఏం?... హి ఈజ్ బ్రిలియంట్... ఇండస్ట్రియస్.... హి ఈజ్ ఇన్ హైపొజంషన్..... ఇన్ ది సొసైటీ! ....ఇదంతా విన్న తర్వాత సౌమిత్రి చేసింది తప్పు కాదన్పిస్తోంది. అదేమన్నా చెప్రాసిగాడినా పెళ్ళాడింది.?కులం ఏదైనా గానీ.... కుర్రాడు బుద్ధి మంతుడు! ఐ కెన్ సర్టిఫై! సో డోన్ట్ వర్రీ మై సన్!

ఆఫ్టాల్..... ఓ పని మనిషి కొడుకు నా అల్లుడుంటే గుండె తరుక్కుపోతోంది. నాస్టేటస్సేంటి....నా లెవలేంటి.?...'

'అక్కడే పొరబడుతున్నావ్! నీ లైఫ్ గానీ నువ్వు గానీ నీ అల్లుడి ఫ్యామిలి బ్యాగ్రౌండ్ మర్చిపోండి. ఈనాడు అతని స్టేటస్ గురించే మనం ఆలోచించాలి! అతను ఎలాంటి వాడైనా.... ఏ కులం వాడైనా.... సొసైటీలో స్టేటస్ వున్న సర్జన్! అందనా... అమెరికాలాంటి కంట్రీలో! మనకంటే అతను దేంట్లో తక్కువ అన్నింటిలోను ఎక్కువనే చెప్పుకోవాలి! మిగతా గతంగురించి ఆలోచించటం మాని... ఆ కుర్రాడి చదువు సంపాదన గురించి ఆలోచిస్తే కా కంటే.....నీకంటే..... గొప్ప స్టేటస్ ఎర్నింగ్‌లో వున్నవాడే కాదనగలవా?..... డోన్ట్ బీ ఫూలష్!.... ఇంకా ఈ మోడ్రన్ డేస్‌లో కూడా కులాల గురించి ఆలోచిస్తూ వర్రీ అవుతున్నావంటే ఆశ్చర్యంగా వుంది!.... నువ్వు అవునన్నా కాదన్నా... నీ కూతురు... అదే నా మనుమరాలు సౌమిత్రి అతగాడిని పెళ్ళాడేసింది! ఇక మనం చేయగలిగిందేమి లేదు. నీకు తెలియందేముంది? రోజులు మారినయ్....ఇంకా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు. నీకూతురు మంచి పనే చేసింది. దాన్ని గానీ నీ అల్లుడ్ని గానీ నిందించాల్సిన పన్లేదు. చూశావా మనుష్యుల నడుమ బంధం ఎలా ఏర్పడి....బాంధవ్యంగా ఎలా మారుతుందో?... మన చేతుల్లో ఏమీ లేదు. పరిస్థితుల ప్రభావానికి తలవంచక తప్పదు!.....' రాఘవను బుజ్జగించి కన్విన్స్ చేశాను.

'చేతులు కాలాకా అకులు పట్టుకోవడం అంటే ఇదే!..... ఇప్పటికే చాలా ఆలస్యమైంది.... లేవండి భోజనాలకు అబ్బా కొడుకులు! గతించిన దాని గురించి చింతించి ఏం ప్రయోజనం....' అంటూ డైనింగ్ హాల్లోకి నడిచింది సుజాత.

--- సమాప్తం ---